

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు

మున్సిపల్ ఆర్‌డి రవీంద్ర

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వ్యాధులు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ బి.రవీంద్ర సిబ్బందికి ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశమ య్యారు. కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. రెవెన్యూ వసూళ్లలో లక్ష్యాలను అధిగమించాలని నిర్దేశించారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ఎంహెచ్ఒ డాక్టర్ సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, ఇఇ ప్రసాద్, డిఇలు, ఎఇలు, ఆర్ఐలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్నఆర్‌డి రవీంద్ర

శివారు భూములకు అందని సాగునీరు

- అధ్వానంగా సాగునీటి కాలువలు
- వరి నాట్లు పడక ఆందోళన చెందుతున్న రైతన్నలు
- బీడు భూములను తలపిస్తున్న పొలాలు
- పట్టించుకోని తోటపల్లి కుడి పాత కాలువ అధికారులు

ప్రజాశక్తి - వంగర

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబల్లి మండలంలో గల తోటపల్లి కుడి పాత కాలువకు శివారున ఉన్న వంగర మండలంలోని కొప్పర వలస, కొత్తవలస, మద్ది వలస, ఎం.సీతారాంపురం, వంగర తలగాం, శివ్వాం తదితర గ్రామాల ఆయకట్టు భూములకు సాగునీరు అందకపోవడంతో వరి నాట్లు వేయక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు వేయకపోవడంతో పొలాలు బీడు భూములను తలపిస్తున్నాయి. ఈనెల 16న తోటపల్లి వద్ద కుడిపాతకాలువకు సాగునీరు విడిచిపెట్టినప్పటికీ వంగర మండలంలోని భూములకు ఏ ఒక్క గ్రామానికి కూడా ఇంత వరకు సాగునీరు అందలేదు. దీంతో రైతులు ఈ ఏడాది ఖరీఫ్ లో వరి నాట్లు వేయగలమో లేదోనని ఆందోళన చెందుతున్నారు. తోటపల్లి నుంచి కాలువ ఉన్నా ఎప్పుడూ శివారు భూములకు సకాలంలో సాగునీరు అందే పరిస్థితి లేదు. అధికారులు మాత్రం కచ్చితంగా సాగునీరు అందిస్తామని చెప్పడమే తప్ప ఎప్పుడూ కూడా సాగునీరు సక్రమంగా అందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తోటపల్లి కుడి పాత ప్రధాన కాలువ ద్వారా వంగర మండలంలోని ఆయకట్టు భూములకు వెంటనే సాగునీరు అందించి ఆదుకోవాలని వివిధ గ్రామాల రైతులు మొరపెట్టుకుంటున్నారు.



కొప్పరవలస వద్ద సాగునీరు రాని తోటపల్లి కుడి పాత కాలువ

అధ్వానంగా సాగునీటి కాలువలు

తోటపల్లి ప్రాజెక్టు ఆయకట్టుకు శివారులో ఉన్న వంగర మండలానికి వచ్చే కుడి పాత ప్రధాన కాలువ ప్రస్తుతం ముళ్లపొ దలు, చెత్త చెదారాలతో, పూడికలతో పేరుకుపోయి అధ్వానంగా ఉంది. దీంతో దిగువ ఆయకట్టుకు నీరు రావటం కష్టంగా ఉందని రైతులు చెబుతున్నారు. ఇక వంగర మండలంలో గల పిల్ల కాలువలు పరిస్థితి మరి చెప్పనక్కర్లేదు.

బోరు నీటితో దమ్ము చేసుకుంటున్న రైతులు

తోటపల్లి కూడి పాత ప్రధాన కాలువ ద్వారా ఇంతవరకు కూడా సాగునీరు రాకపోవడంతో వరి నార్లు ముదిరిపోతాయనే ఉద్దేశంతో శివ్వాం, తలగాం, ఎం. సీతారాంపురం గ్రామాలకు చెందిన కొంతమంది రైతులు బోర్లు నీటితో పొలాలలో దమ్ము చేపట్టి వరి నాట్లు వేసుకుంటున్నారు. ఒకపక్క బోర్లు మొరాయిస్తున్నా, ఎక్కువ మొత్తంలో డబ్బులు ఖర్చు అవుతున్నప్పటికీ సక్రమంగా వరి నాట్లు పనులు జరగటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రెండు రోజుల్లో సాగునీరు అందిస్తాం

ప్రాజెక్టు కుడి పాత కాలువ ద్వారా వంగర మండలంలోని భూములకు రెండు రోజుల్లో సాగునీరు అందిస్తామని ఎఇ దేవర వెంకటరమణ తెలిపారు.



నీరు లేక ఎండిపోతున్న వరి నారు



ఎం. సీతారాంపురంలో బోరు నీటితో దమ్ముపడుతున్న రైతులు

అన్నదాత సుఖీభవకు రూ.148.35 కోట్లు

2న జిల్లా వ్యాప్తంగా పంపిణీ : కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట/కంటోన్మెంట్

అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలోని 2,19,503 మంది రైతులకు లబ్ధి చేకూరనుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఆగస్టు 2వ తేదీన జిల్లా వ్యాప్తంగా పంపిణీకి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం జరిగిన ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకంలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకంలో రాష్ట్ర వాటా కింద 2,19,503 మంది రైతులకు 5 వేల రూపాయలు చొప్పున మొత్తం 109.75 కోట్లు, కేంద్రం వాటా కింద పిఎం కిసాన్ ద్వారా 2 వేల రూపాయలు చొప్పున 1.93 లక్షలమందికి 38.60 కోట్లు రూపాయలు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేసారు. జిల్లాలో ప్రతి గ్రామ సచివాలయంలో సభ పెట్టి లబ్ది దారులకు అందజేయాలని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం ఉద్దేశం గురించి వివరించాలని, ప్రభుత్వం రైతులకు చేస్తున్న సహాయాన్ని, వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత వల్ల కలిగే లబ్ధి, మారుతున్న ఆహారపు అలవాట్లకు తగ్గట్లు పంటలు పండించడం వంటి విషయాలను విస్తృతంగా ప్రచారం చేయుటానికి కరపత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. నియోజకవర్గంలో జరగబోయే కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అన్నారు. సమావేశంలో కెఆర్ఆర్‌సి ప్రత్యేక కలెక్టర్ మురళి, జిల్లా వ్యవసాయాధికారి తారక రామారావు, లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ రమణమూర్తి, జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ అధికారిణి శారద, జిల్లాపరిషత్ సిఇఒ బివి సత్యనారాయణ, సిపిఒ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

రూ.24.6 కోట్లతో జలవనరుల పనులకు ప్రతిపాదన

ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద మరమ్మతులు, ఆధునీకరణ కోసం జిల్లాలో 19 పనులను గుర్తించినట్లు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో జలవనరుల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎంకెఎస్ వై-ఆర్ఆర్ఆర్ పథకం కింద ఎంపిక చేసిన 19 పనుల కింద జిల్లా లో 6873 ఎకరాల ఆయకట్టుకు నీరందించడానికి 24.6 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుల సాధ్యతపై రీ వెరిఫికేషన్ చేసి వారం లోగా నివేదికనివ్వాలని తెలిపారు. సమావేశంలో జలవనరుల శాఖ ఎస్ఇ స్వర్ణ కుమార్, తోటపల్లి ఇఇ పి.అప్పల నాయుడు, రెగ్యులర్ ఇఇ ఎంవి రమణ, టిటిపిఆర్ డిఇ హరి, డిఇలు గోవింద్, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు..

పెండింగ్ సమస్యలపై 2న ఉపాధ్యాయుల ధర్నా

విజయవంతం చేయాలని ఫ్యాప్టో పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2న కలెక్టరేట్ వద్ద జరుగనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ఎపిటిఎఫ్ (257) కార్యాలయం లో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పి.శ్రీనివాస ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు బకాయి ఉన్న రెండు నెలలు జీతాలు చెల్లించాలని, పొజిషన్ ఐడిలు తదితర సాంకేతిక నిబంధనలు పెట్టి రెండు నెలల జీతాలను ఇవ్వకపోవడం వల్ల చాలా మంది ఉపాధ్యాయులు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారు తెలిపారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని, వీటితో పాటుగా 18 డిమాండ్ల సాధనకు ఈ ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్ ఈశ్వరరావు, కె.జోగారావు, సూరిబాబు(ఎస్‌టియు), ఎన్.పైడిరాజు (ఎపిటిఎఫ్ -1938) తదితరులు పాల్గొన్నారు



పరిశీలిస్తున్న కమిషనర్

పారిశుధ్య పనులు పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య గురువారం వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా కాలువల పరిశుభ్రత, పారిశుధ్య విధానాలను గమనించారు. అనంతరం అన్న క్యాంటీన్‌కు చేరుకుని ప్రజలకు అందుతున్న ఆహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య విధానంలో సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరవుతున్నారా లేదా అన్నది గమనించారు.

నేడు ఆపస్ నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మండల విద్యాశాఖ అధికారి 1గా కేవలం ప్రభుత్వ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లను నియమించడమంటే జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను అవమానపరచడమేనని ఆపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, బల్లా. శ్రీనివాసరావులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలపాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఏకీకృత సర్వీసు రూల్స్‌కు సంబంధించి కోర్టు కేసు పెండింగ్‌లో ఉండగా ఇలాంటి చర్యలు చేపట్టడం సరికాదని తెలిపారు.

కుష్టు రోగుల పాదరక్షలకు రూ.50వేలు విరాళం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కుష్టువ్యాధి గ్రస్తులకు ప్రత్యేక పాదరక్షలు నిమిత్తం వెంకటపద్మ ఆసుపత్రి ఎమ్‌డి డాక్టర్ ఎం.వెంకటేశ్వరావు రోటరీ డిస్ట్రిక్టు మాజీ గవర్నర్ డాక్టర్ పద్మకుమారి రూ.50వేలు లెప్రా సొసైటీ ఫండ్ రైసింగ్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు అందించారు. ఈ సందర్భంగా కుష్ఠ వ్యాధిగ్రస్తులకు సహాయ సహకారాలు అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. వారిపై వివక్ష చూపకుండా ప్రేమతో ఆదరించాలని చెప్పారు. లెంక రమణ మాట్లాడుతూ జిల్లాలో లెప్రా సొసైటీ జిల్లా ప్రభుత్వ మహారాజ ఆసుపత్రిలో జిల్లా కుష్టు నివారణ అధికారి సహకారంతో బాధితులకు అంగవైకల్యం నివారణకు రిఫరెల్ సెంటర్ ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు ఉచితంగా ప్రత్యేక పాదరక్షలు, సెల్ఫ్ కేర్ కిట్లు, ఫిజియో థెరపీ సేవలు అందించనున్నట్లు తెలిపారు.

రైతుబజార్ భూమి రక్షణకై ప్రజాఉద్యమం

రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పాత ఆసుపత్రి వద్ద ఉన్న రైతు బాజార్ స్థలం పక్కా ప్రభుత్వ స్థలమని, దాన్ని రక్షించుకునేందుకు ప్రజాఉద్యమం చేపడతామని విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానించారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ మావేశంలో ముందుగా పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని సభ్యులంతా ఆమోదించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ రైతుబజార్ భూమి 22ఎ నుంచి తప్పించి ప్రభుత్వ భూమిని రాజులకు అప్పగించిన అధికారులు తీరు అన్యాయమన్నారు. సంస్థానాల అధీనంలో ఉన్న రైతుబజార్ భూమి సంస్థానాలు రద్దు అయిన తర్వాత ప్రభుత్వం భూమిగా మారిపోయిందన్నారు. 1948లో జమిందాదీ వ్యవస్థ రద్దు చేసి భూములన్నీ రైతువారి పద్ధతిలోకి వచ్చాయన్నారు. 1968లో ల్యాండ్ సీలింగ్ చట్టం వచ్చిన తర్వాత అయితే ప్రభుత్వం చేతిలో లేదా మాన్సాస్ ట్రస్టు చేతిలో ఉన్నాయి తప్ప రాజులు చేతిలో ప్రత్యేకంగా భూములు లేవన్నారు. కానీ నేడు ఆ భూములు తమవని చెప్పి చీకటి జీవోలు తెచ్చి అశోక్‌గజపతిరాజు, వారసులు కలిపి భూములన్నీ కాజేయాలని చూస్తున్నారని అన్నారు. అందులో భాగంగా జీఓ 124 తెచ్చి రైతు బజార్ భూమి లాగేసుకున్నారని అన్నారు. చీకటి జీవోలు రద్దు చేయాలని, ఆభూమి రైతులకు అప్పగించాలని, మిగిలిన భూములు ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పట్టణ పౌర సంక్షేమసంఘం కార్యదర్శి శంకర్రావు మాట్లాడుతూ రైతు బజారు భూమి రక్షణకు చేపట్టనున్న ప్రజా ఉద్యమానికి ప్రజలంతా మద్దతివ్వాలని కోరారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస మాట్లాడుతూ నగరంలో ఉన్న చారిత్రిక కట్టడాలైన ఎంఆర్ కాలేజీ, జిల్లా కేంద్రాస్పత్రి, మ్యూజిక్ కాలేజీ, సింహాచలం మేడ ఇవన్నీ కూడా తీసుకోరని గారంటీ ఏమిటని ప్రశ్నించారు. సింహాచలం ఎందుకు కొట్టేస్తున్నారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. విజయనగరం కాలనీస్ అండ్ అపార్ట్ మెంట్స్ అసోసియేషన్ నాయకులు యుఎస్ రవికుమార్, మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు రక్షణ కోసం పోరాడాలని అన్నారు. సమావేశవంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్, కులవివక్ష వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కార్యదర్శి ఆర్.ఆనంద్. సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, అధ్యక్షులు జగన్ మోహన్, సోమేశ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్, సతీష్, అవాజ్ నాయకులు అస్లాం, పట్టణ పౌర సంక్షేమసంఘం అధ్యక్షులు వి.రామ చంద్రరావు తదితరులు మాట్లాడారు. సమావేశానికి ప్రజలు, ప్రజా సంఘాలు పాల్గొని మద్దతు ప్రకటించారు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ఎమ్మెల్యే గారూ నమస్తే... ఆ నమస్తే నమస్తే...

ప్రజాశక్తి- చీపురుపల్లి

'ఎమ్మెల్యే గారూ నమస్తే... ఆ సత్తిబాబు గారూ నమస్తే నమస్తే.. మీరేంటి నాకు నమస్కారం చేస్తున్నారు.. లేదు లేదు మీరు సీనియర్లు కదా.. అబ్బే అదేం కాదు.. చీపురుపల్లిలో నేను జూనియర్‌నే కదా..' అంటూ మాజీ మంత్రులైన బొత్స సత్యనారాయణ, కిమిడి కళా వెంకటరావులు కాసేపు చలోక్తులు విసురుకున్నారు. ఈ సంఘటన చూసిన విజయనగరం పార్లమెంట్ మాజీ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ తో పాటు బొత్స వెంట ఉన్న వైసిపి నాయకులు, మరోపక్క కళా వెంకట్రావుతో వచ్చిన టిడిపి నాయకులు సరదాగా కాసేపు నవ్వుకున్నారు. గురువారం చీపురుపల్లిలో జరిగిన ఒక వివాహ కార్యక్రమానికి హాజరైన వైసిపి నాయకులు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే కిమిడి కలావెంకటరావులు ఒకరికొకరు ఎదురు పడినప్పుడు ఈ సంఘటన చోటు చేసుకుంది.



వివాహ వేడుకలో ఒకరినొకరు పలుకరించుకుటున్న బొత్స, కళా వెంకటరావు

పాఠశాల భవనం నిర్మించాలి

యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి

ప్రజాశక్తి- మెంటాడ

పాఠశాల భవనం శిథిలమై 24 ఏళ్లు గడుస్తున్నా పాఠశాలకు నూతన భవనం నిర్మించరా అని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి అన్నారు. మండలంలోని కొండలింగాలవలస పంచాయతీ మధుర గిరిజన గ్రామం రెడ్డి వానివలసలో పాఠశాలను ఆమె గురువారం పరిశీలించారు. శిథిల భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించకపోవడంతో ఒక అద్దె కొంపలో ఇరుకు గదుల్లో వెలుతురు లేని పరిస్థితిలో విద్యను అభ్యసించాల్సి వస్తుందన్నారు. 2019లో ఇదే గ్రామాన్ని సందర్శించినప్పుడు పక్కా భవనానికి అధికారులు నిధులు మంజూరు చేయాలని విన్నవించామన్నారు. అయినప్పటికీ విద్యార్థులు ప్రశాంతంగా చదువుకోడానికి, ఉపాధ్యాయులు బోధించడానికి వీలులేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ పాఠశాలలో 28 మంది పిల్లలు విద్యని అభ్యసించగా తమకు బడి కావాలని అభ్యర్థిస్తే ఉన్నత అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడం అన్యాయం అన్నారు. విద్యార్థుల సృజనాత్మకత, విజ్ఞానం వారికి కల్పించే మౌలిక వసతులపై ఆధారపడి ఉంటుందని ఆమె అన్నారు. గిరిజన విద్య అభివృద్ధి చెందాలంటే ఆయా గ్రామాలలో రోడ్లు, పాఠశాలలు మౌలిక సదుపాయాలపై ఆధారపడి ఉంటుందని అన్నారు. స్థల సమీకరణ చేసి భవనాన్ని పునాదులతో వదిలేశారని ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకొని రెడ్డి వానివలసలో శాశ్వత పాఠశాల భవనం పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని ఆమె కోరారు. గ్రామస్తులు కలెక్టర్‌కు తమ విజ్ఞప్తి తెలియజేయాలని ఆమెకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు శిరీష, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.



రెడ్డివానివలసలో విద్యార్థులు, ఉపాధ్యాయునుద్దేశించి మాట్లాడుతున్న విజయగౌరి



అలల తాకిడితో కోతకు గురైన తీరం

సునామీ ఎఫెక్ట్

●అప్రమత్తమైన అధికారులు ● తీర మండలాల్లో మాక్ డ్రిల్

ప్రజాశక్తి -పూసపాటిరేగ

రష్యా, జపాన్, అమెరికాలో సునామీ హెచ్చరికలు... జపాన్‌లో భూకంపం రిక్టార్ స్కేల్‌పై 8.8 తీవ్రతతో నమోదైన నేపథ్యంలో జిల్లా తీర ప్రాంతం ముఖ్యంగా భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. సునామీ వస్తే తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించా లన్న దానిపై మాక్ డ్రిల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గురువారం పూసపాటిరేగ, భోగాపురం తహాశీల్దార్ విఆర్‌ఒలతో అత్యవసర సమావేశం జూమ్‌లో ఏర్పాటు చేశారు. సునామీ వస్తే పరిస్థితి ఏంటని అడిగి తెలుసుకున్నారు. వెంటనే తీర గ్రామాల్లో పరిస్థితిని నమోదు చేసుకోవా లన్నారు. సముద్రానికి ఏయే గ్రామాలు దగ్గరలో ఉన్నాయని, వాటి పరిస్థితి తెలియజేయాలన్నారు. తహాశీల్దార్‌లు తీరప్రాంత విఆర్‌ఒలకు స్పష్టమైన మార్గదర్శకాలు అందజేశారు. వాటిలో ముఖ్యంగా సునామీ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలి, తీర గ్రామాలలో ఉన్న ప్రజలకు వెంటనే దండోరా వేయడంతో పాటు సమాచారం అందించాలని, అత్యవసర పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించే మార్గాలు సిద్ధంగా ఉంచాలని, మత్స్యకారులను సముద్రంలోకి వెళ్లవద్దని ముందుగానే తెలియజేయడానికి కావాల్సిన ఏర్పాట్లతో పాటు స్థానికంగా ఉన్న పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హాల్స్ లాంటి వనరులను ఉపయోగించుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలుకు ఎంటువంటి భయాందోళనలు కలగజేయకుండా ఇది మాక్ డ్రిల్ మాత్రమే అని చెప్పాలని తహాశీల్దార్ ఎన్‌వి రమణ విఆర్‌ఒలకు తెలిపారు.

పిహెచ్‌సి వైద్యులకు శిక్షణ

కంటోన్మెంట్ : పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిల వైద్యులకు డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి ఆధ్వర్యాన గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. రాష్ట్ర ఎస్ఎంఒ జాన్ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్‌లో యుడబ్ల్యుఐఎన్ పోర్టల్‌పై వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సూర్యనారాయణ, జిల్లా టీకా నివారణ అధికారి డాక్టర్ ఆర్. అచ్యుత కుమారి, ఎన్‌సిడిపిఒ డాక్టర్ సుబ్రహ్మణ్యం, వైద్యాధికారులు పాల్గొన్నారు.


వన్‌స్టాప్ సెంటర్‌పై అవగాహన సదస్సు

విజయనగరం టౌన్ : కేంద్రీయ విద్యాలయంలో గురువారం వన్ స్టాప్ సెంటర్ పై అవగాహన సదస్సు జరిగింది. తొమ్మిదవ తరగతి నుండి పన్నెండవ తరగతి చదువుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని చట్టబద్ధంగా ఏవిధంగా పరిష్కరించుకోవాలో వన్ స్టాప్ సెంటర్ నిర్వాహకురాలు రిసోర్స్ పర్సన్ పి.సాయి విజయలక్ష్మి వివరించారు. సభ్యులకు ప్రిన్సిపాల్ దిలీప్ మోడీ కృతజ్ఞతలు తెలిపారు

విన్‌వే పాఠశాలలో ఘనంగా ఎల్లో డే

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని విటి అగ్రహారం గణేష్‌నగర్‌లోగల విన్‌వే ఇంగ్లీషు మీడియం పాఠశాలలో గురువారం ఎల్లోడే నిర్వహించారు. పిల్లలంతా పసుపు కలర్ డ్రెస్‌లు ధరించి సందడి చేశారు. ఎల్లో కలర్ పై పిల్లలకు అవగాహన కల్పించి, దాని రంగులో ఉన్న పువ్వులు, పండ్లు ఆకారాలను తయారు చేసి పిల్లలకు వాటిపై అవగాహన కల్పించి వారిలో సృజనాత్మక శక్తి వెలికి తీయడానికి ఇటువంటి ప్రయత్నం చేశామని పాఠశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పా ఠశాల ఎఒ నెహ్రూ, ఉపాధ్యాయులు ఉమా, రమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎల్లో డ్రెస్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మున్సిపల్ కార్మికుల ధర్నా

విజయనగరం టౌన్ : పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.కామేష్, ఎస్.రంగ రాజు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కమిషనర్ నల్లనయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టవఎఇ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కార్మికులు గా పనిచేసి రిటైర్డు అయిన వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం లేనందున వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు.



వికలాంగ విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేస్తున్న ఎంఇఒ తిరుమల ప్రసాద్

విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి - రామభద్రపురం

స్థానిక భవిత కేంద్రంలో చదువుతున్న వికలాంగ విద్యార్థులకు సమగ్రశిక్ష సహకారంతో ఉచితంగా ట్రై సైకిళ్ళు, వీల్ ఛైర్స్, వినికిడి యంత్రాలను ఎంఇఒ తిరుమల ప్రసాద్ చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగులకు ఎస్కార్ట్, రవాణా భత్యం, రీడర్ అలవెన్సు, బాలికలకు స్టైఫండ్, ఉచిత ఉపకరణాలు, స్కాలర్షిప్స్, ఫిజియోథెరపీ, పెన్షన్, పరీక్షల్లో రాయితీలు, విద్యా, ఉద్యోగ రిజర్వేషన్స్ వంటి వివిధ సౌకర్యాలను సమకూరుస్తుందని వీటిని సద్వినియోగం చేసుకుని తమ లోపాన్ని అధిగమించి అందరితో పాటు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవిత ఐఇఆర్‌పిలు చింతల రాజేశ్వరి, గండి తేజస్విని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- గంట్యాడ

రైతులకు ప్రభుత్వం అందించిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ.నాగభూషణం అన్నారు. గురువారం రామవరం, రావివలస రైతు భరోసా కేంద్రాల్లో మెలైన యాజమాన్య పద్ధతులు, పిఎంఆర్‌కెవివై ఖరీఫ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు దిగుబడిని సంపాదించడానికి రాయితీలతో అనేక పథకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎరువులు అమ్మకంలో డీలర్లు అధిక ధరలను తీసుకుంటే స్థానిక వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఎరువులు లభ్యత, నానో యూరియా, నానో డిఎపి ఉపయోగాలు, అన్నదాత సుఖీభవ పథకం, పంటలు బీమా పథకం ఈ పంట గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి పి.నిర్మల, ఎఒ గోవిందమ్మ, బి.శ్యామ్ కుమార్, వేణు, ఉష, వ్యవసాయ సహాయకులు గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

కుక్క కాటుకు జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - వేపాడ

కుక్క కాటుతో జాగ్రత్తలు అవసరమని సింగరాయి వెల్నెస్ సెంటర్ సిహెచ్ఒ పార్థసారథి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కుక్క కాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. సురక్షితమైన ప్రాంతానికి వెళ్లిపోవాలని, గాయం ఉన్న ప్రాంతాన్ని ముందుగా సబ్బుతో గాని, నీటితో కానీ కగడకూడదని అన్నారు. రక్తస్రావం ఆపి యాంటీ సెప్టిక్(ద్రవ్యద్రవం) వేయాలన్నారు. వెంటనే వైద్య సహాయం పొందాలని యాంటీ రాబిస్ టీకాలు వేయించాలని సూచించారు.

కెకెఎం రాజుకు ఘన సత్కారం

ప్రజాశక్తి- డెంకాడ

5వ బెటాలియన్ యూనిట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం రిజర్వు సిఐ కెకెఎం రాజు పదవీ విరమణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమాండెంట్ మలికా గార్గ్, రాజు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజు కానిస్టేబుల్‌గా తన పదవీ జీవితాన్ని ప్రారంభించి, రిజర్వ్ సిఐ స్థాయికి పదోన్నతిని పొందారని అన్నారు. పోలీస్ శాఖలో ఆయన అందించిన విశిష్ట సేవలకు గాను సేవా పతకం, ఉత్తమ సేవా పతకం, అతిఉత్కృష్ట సేవాపతకం, ఇండియన్ పోలీస్ మెడల్ వంటి అవార్డులు లభించాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ రాజా రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు లక్ష్మీ నారాయణ, రమణమూర్తి, బాపూజీ, యూనిట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సంకల్ప రథంతో అవగాహన

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని శ్రీచైతన్య కళాశాల, మున్సిపల్ హైస్కూల్, గొల్లపల్లిలో సంకల్ప రథంతో పోలీసులు విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై వీడియో రూపంలో అవగాహన కల్పించారు. బొబ్బిలి సిఐ కె.సతీష్ కుమార్ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు వాడడం వల్ల యువత తమ బంగారు భవిష్యత్‌ను పాడుచేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ ఆటో బోల్తా

విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి- కొత్తవలస

మండలం అర్థానపాలెం ఏపీ మోడల్ స్కూల్ నుంచి మంగళపాలెం వెళ్తున్న ఆటో గురువారం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆరుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఇందులో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఫీట్లు చేయడంతో ఆటో బోల్తా పడినట్లు విద్యార్థినులు తెలిపారు. డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి- గంట్యాడ

విద్యుత్తు లైన్ల కింద ఉన్న చెట్లను తొలగించే పనిలో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్తు నిలుపుదల చేస్తున్నామని ఎఇ శ్రీనివాసరావు తెలిపారు. 33/11 కెవి గంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలో రామవరం రూరల్, భరతనాపల్లి, చిన్నమానాపురం గ్రామాలకు విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కుంపల్లి గ్రామ సచివాలయం పరిధిలో గల దొగపేట, పైడికొంపలు, కుంపల్లి ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒ బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. కిచెన్ గార్డెన్స్, టాయిలెట్స్, ఎండిఎం, పాఠశాలలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.




విద్యార్థినిని చదివిస్తున్న ఎంఇఒ

విద్యుత్‌ఛార్జీల పేరిట నిలువు దోపిడీ ఆపాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యుత్ ఛార్జీల నిలువు దోపిడీ ఆపాలని, 2014 నుండి 2019 వరకు వాడుకున్న కరెంటుకు మళ్లీ అదనంగా రూ.3 వేల కోట్లు ఛార్జీలు గత 36 నెలలు నుండి వసూలు చేస్తున్నారని ప్రజావేదిక నాయకులు పి.శంకర్రావు అన్నారు. ప్రతి నెలా అదనంగా 40 పైసలు ఇంధన సర్దుబాటు ఛార్జీలు బాదుడు సాగుతూనే ఉందన్నారు. ఈ ఒక్క సంవత్సరంలోనే రూ.2787 కోట్లు అదనపు భారం వేశారన్నారు. పట్టణంలో గురువారం ప్రజా వేదిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు మిగులు ఉందని చెబుతూనే అదనపు సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గం అన్నారు. వ్యాపారులు చిన్న పరిశ్రమలపై విద్యుత్ సుంకం యూనిట్ 6 పైసలు నుండి 100 పైసలకు వైసిపి ప్రభుత్వం పెంచిందని కూటమి ప్రభుత్వం దానిని తగ్గించకపోగా చట్ట సవరణ చేసి భారం కొనసాగిస్తుందని గుర్తు చేశారు. ఈ భారాలన్నిటినీ కప్పిపుచ్చి రూ.450 కోట్లు ఛార్జీలు ట్రూ డౌన్ ద్వారా తగ్గిస్తున్నట్లు నమ్మబలుకుతున్నారన్నారు. ఆదాయాలు పెరగక కరెంటు బిల్లులు కట్టలేక జనం అవస్థలు పడుతున్నారని, చిన్నా, మధ్యతరగతి వ్యాపారులు, పరిశ్రమలు దెబ్బతింటున్నాయని అన్నారు. కొన్ని పరిశ్రమలు మూతపడటంతో ఉపాధి కోల్పోతున్నారన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై జరిగే ఉద్యమంలో కలసి వస్తే స్మార్ట్ మీటర్లను అడ్డుకుందామని ఆగస్టు 5న బొబ్బిలి డివిజనల్ ఆఫీసు వద్ద జరిగే ఆందోళనలో సంతకాలు వినతి పత్రాలతో తరలి రావాలని పిలుపునిచ్చారు.



బొబ్బిలి: సంతకాల సేకరణలో పాల్గొన్న స్థానికులు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి జంక్షన్ వద్ద ప్రజా వేదిక ఆధ్వర్యంలో గురువారం స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ కూటమి నేతలు ముఖ్యంగా లోకేష్ స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండి అని ఎన్నికల ముందు పిలుపు ఇచ్చారని, సర్దుబాటు ఛార్జీలను వసూలు చేసి ప్రజలపై భారాలు వేయమని హామీలు ఇచ్చారని, అధికారంలోకి రాగానే ఒత్తిడి తెచ్చి అదానీ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని మండిపడ్డారు. అదానికి లొంగిపోయిన జగన్మోహన్ రెడ్డిని ఓడించండి అని పిలుపునిచ్చి ఇప్పుడు జగన్ మోహన్ రెడ్డి దారిలోనే నడుస్తూ అదానికి లాభాలు తెచ్చే ప్రక్రియకు పూనుకున్నారన్నారు. ఇది ప్రజల్ని మోసం చేయడమేనని, మోడీ ప్రభుత్వానికి తలవగ్గి అదానికి సేవ చేస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను దొడ్డి దారిన ఎలాగైనా బిగించాలని చూస్తున్నారని, దీని వల్ల అదానీ కంపెనీ గుప్పెట్లో కరెంటు ఉంటుందని ప్రజలకు చీకటి మిగులుతుందని దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. 2000 సంవత్సరంలో విద్యుత్ పోరాట స్ఫూర్తితో ప్రజలు ముక్తకంఠంతో స్మార్ట్ మీటర్లను తిరస్కరించేందుకు ఈ నెల 5వ తేదీన గజపతినగరం కరెంటు ఆఫీస్ వద్ద జరుగు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.గౌరీస్, ఎం.గౌరినాయుడు, ఎం.సతీష్, నాగరాజు, బి.అప్పలనాయుడు, ఎల్.రాము తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: అధాని స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలని ప్రజా వేదిక ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ ప్రజా చైతన్యాన్ని తీసుకురావడం కోసం ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుంటినవలసలో కరపత్రాలను పంపిణీ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి శ్రీనివాస్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెడితే సెల్‌ఫోన్ మాదిరిగానే రీఛార్జి చేసుకుంటేనే కరెంటు ఉంటుందన్నారు. అదాని నచ్చిన రేటుకు కరెంటు అమ్మితే ప్రజలు నెత్తిన వేసుకొని కొనాల్సిందేనని చెప్పారు. భవిష్యత్తులో రైతులకు, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు చిన్నచిన్న షాపులకు ఇచ్చిన రాయితీలు సబ్సిడీలు గాలిలో కలిసిపోతాయన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తూ ఈ నెల 5వ తేదీన గజపతినగరం కరెంటు ఆఫీస్ వద్ద జరిగే దర్నాలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి లింగాల వెంకట్రావు, సిహెచ్ కృష్ణ, సిహెచ్ అప్పారావు, లింగాల అప్పారావు, ఎం అప్పలకొండ, జే గురమ్మ, లింగాల గౌరమ్మ, పైల సిరమ్మ, పైల సన్యాసమ్మ, పైలు పాపమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని లోతుగెడ్డ సచివాలయ ఆవరణలో కౌలు రైతుల సంఘం, ఆదివాసి గిరిజన సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నేతలు రాకోటి రాములు, వంత్ర రాంబాబు, అంటపర్తి చిన్నారావు, ఎలుచూరు ప్రకాష్ రావు, జర్ర ఆంజనేయులు, కపాటి శంకర్రావులు విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, విద్యుత్ ఛార్జీలు నిలువ దోపిడిని అరికట్టాలని మే 5వ తేదీన ఇద్దనవలస సబ్ స్టేషన్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ముఖ్యమంత్రికి వ్యక్తిగత, ఉమ్మడి సంతకాలతో కూడుకున్న వినతి పత్రాలు పంపించాలని, సంతకాలు సేకరిస్తున్నామని ఆయన తెలిపారు.

ప్రజా వేదిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



మెంటాడ: స్మార్ట్‌మీటర్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జి.శ్రీనివాస్

గిరిజన గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని దారపర్తి, బొడ్డవర పంచాయతీలోని గిరిజన గ్రామాల్లో గురువారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఒక్కొక్క గిరిజన గ్రామంలోని ఇండ్లలోను, బహిరంగ ప్రదేశాలల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషను తరువాత ఎటువంటి నాటు సారా, గంజాయి, నాటు తుపాకీలు లభించలేదని చెప్పారు. నేరాలను నియంత్రించి, ప్రజల భద్రత, రక్షణ కల్పించుటలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. ఈ గ్రామాలతో పాటు దారపర్తి పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాలైన మునుపురాయి, రాయపాలెం, చప్పనిగెడ్డ, పల్లపు దుంగాడ, రంగవలస, పాతశెనగపాడు, కొత్త సెనగపాడు, దబ్బగుంట గ్రామాల్లోనూ, మూల బొడ్డవర పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం, బొడ్డపాడు, చిలకపాడు, చిట్టెంపాడు, గుణపాడు గ్రామాల్లో ఈ కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. బృందాలుగా ఏర్పడిన పోలీసులు 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషను నిర్వహించారన్నారు. ఈ బృందాలకు ఎస్.కోట సిఐ వి.నారాయణ మూర్తి, కొత్తవలస సిఐ షణ్ముఖరావు, విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణరావు నాయకత్వం వహించారన్నారు. ఈ ఆపరేషనులో 16మంది ఎస్ఐలు, 85 మంది పోలీసు సిబ్బంది బృందాలుగా ఏర్పడి, వారికి నిర్దేశించిన గిరిజన గ్రామానికి చేరుకొని, ఇండ్లు, బహిరంగ ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారన్నారు. అనుమానిత వ్యక్తులు పారిపోయేందుకు అవకాశం ఉన్న మార్గాలను ముందుగా గుర్తించి, ఆయా మార్గాలను పోలీసు బృందాలతో దిగ్బంధనం చేసామన్నారు. గ్రామాల్లో మకాం వేసిన అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేసామన్నారు. అనంతరం, గ్రామస్థులతో సమావేశమై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ వద్దని, గంజాయి అక్రమ రవాణ, విక్రయాలు, వినియోగంకు దూరంగా ఉండాలని సూచించారు. లైసెన్సులు లేకుండా ఆయుధాలు కలిగి ఉండడం చట్టరీత్యా నేరమని, ఎవరి వద్దనైనా అనుమతులు లేకుండా ఆయుధాలు లభిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేర నియంత్రణే లక్ష్యంగా పోలీసుల కార్డాన్ అండ్ సెర్చ్



ఇళ్లల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

రోడ్డు ఆక్రమణలు తొలగింపు

శృంగవరపుకోట: పట్టణంలోని దేవి కూడలి నుండి ప్రభుత్వ కళాశాల మైదానం వరకు విశాఖ అరకు రహదారిని ఆక్రమించి నిర్మించిన దుకాణాలను తహశీల్దార్ శ్రీనివాసరావు గురువారం జెసిబి సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు మార్జిన్ ఆక్రమణల వల్ల వర్షం కురిసేటప్పుడు మురుగునీరు పోయేందుకు మార్గం లేక విశాఖ రహదారిలో వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఈ విషయమే పలువురు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే లలిత కుమారి, డిసిఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని దుకాణదారులతో మాట్లాడారని చెప్పారు. ఈ నేపథ్యంలో దుకాణాలను తొలగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యనిర్వాహణాధికారి అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

భూములిచ్చి మోసపోయాం

శృంగవరపుకోట: జిందాల్ పరిశ్రమ పెడతానని, ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తారని, భూమి విలువకు సరి సమానమైన, కంపెనీలో వాటాగా షేర్లు ఇస్తానని, నమ్మించి భూమి తీసుకున్న జిందాల్ యాజమాన్యం రైతులను మోసం చేసి ఇప్పుడేమో ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్‌కు సిద్ధపడుతుందని సిపిఎం నాయకుడు చల్లా జగన్ అన్నారు. గురువారం జిందాల్ బాధితుల తమ నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు ఇచ్చి తాము నష్టపోయాం భూములు కొని మీరు నష్టపోవద్దని తెలిపారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ తమ పోరాటం జిందాల్ పైనేనని జగన్ స్పష్టం చేశారు. తాము చేస్తున్న న్యాయ పోరాటం వల్ల ఏ రోజుకైనా మోసం చేసి తీసుకున్న తమ భూములు తమకే దక్కుతాయని మీరు ఎవరూ మోసపోవద్దు అని తెలియజేశారు. రైతుల ఆమోదం లేకుండా ఎవరైనా భూమి కొనేందుకు ముందుకు వస్తే వారు కూడా అలాగే నష్టపోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు పాల్గొన్నారు.

వసతి గృహ సందర్శన

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- చీపురుపల్లి

స్థానిక బిసి వసతి గృహంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల పైన ప్రజాశక్తిలో గురువారం ప్రచురితమైన 'పెట్టిందే మెనూ ఇష్టముంటే తిను' అనే ప్రత్యేక కథనంపై అధికారులు స్పందించి గురువారం రాత్రి వసతి గృహాన్ని సందర్శించారు. జిల్లా బిసి అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులంతా పేపర్లో వచ్చిన కథనాలు వాస్తవమని వార్డెన్ కారణంగా ఇబ్బందులకు గురవుతున్నామంటూ ముక్త కంఠంతో మరోసారి అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ వద్ద విన్నవించుకున్నారు. వసతి గృహంలో జరిగిన వాస్తవాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వద్ద నుండి ఒక నివేదికను తయారుచేసి జిల్లా ఉన్నతాధికారులకు వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నట్లు అసిస్టెంట్ బీసీ వెలర్ అధికారి కృష్ణ వివరించారు. ప్రజాశక్తిలో వచ్చిన కథనం నిజమేనని కచ్చితంగా వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థులంతా కోరారని ఆయన వివరించారు.

నాణ్యమైన విద్య అందించాలి

ప్రజాశక్తి - వంగర

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి (డిఐఇఒ) శివ్వాల తవిటి నాయుడు అధ్యాపకులకు సూచించారు. ఈ మేరకు ఆయన మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అధ్యాపకులతో సమావేశం నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ కళాశాలలో ప్రభుత్వం అందించే ప్రోత్సాహాన్ని, పోటీ పరీక్షల మెటీరియల్, (ఇపిసిఇటి) టెక్స్ట్ బుక్స్ నోట్ బుక్స్ సైన్స్ రికార్డులు మిడ్ డే మీల్ వంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోట రవిశంకర్, అధ్యాపకులు సురేష్, ఈశ్వరరావు పాల్గొన్నారు.



సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న డిఐఇఒ తవిటినాయుడు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - రామభద్రపురం

కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్ర పురోభివృద్ధి సాధ్యమని రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణరంగారావు అన్నారు. మండల పరిధిలోని బూసాయవలస గ్రామంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సేవే లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పటికీ సిఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేసి దేశంలోనే మన రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడానికి పి4 కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. పేదరిక నిర్మూళనకు ఈ పథకం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఇప్పటికే రైతుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు రూపొందిస్తున్నారని, తల్లికి వందనం పథకం ద్వారా ప్రతీ విద్యార్థికి రూ.15వేలు, దీపం పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఏటా 3 గ్యాస్ సిలెండర్లు ఇస్తున్నారన్నారు. మెగా డిఎస్‌సి ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారని, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ఎంతో మంది పెట్టుబడిదారులను ఆకర్శిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని, కోట్లాది రూపాయలు అవినీతి చేసి రాష్ట్రాన్ని ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, బీసీ సంక్షేమ ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు, మండల క్లస్టర్ ఇంఛార్జి గంట సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిశుమందిర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విజయనగరం జోనల్ క్రీడా పోటీల్లో శిశు మందిర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ నెల 25న విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో జరిగిన క్రీడా పోటీల్లో 600 మీటర్ల పరుగు పందెంలో పతివాడ పైడి నాయుడు ప్రథమ స్థానం, హై జంప్‌లో ద్వితీయ స్థానం సాధించి సత్తెనపల్లి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మీసాల లావణ్య 400 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం, హై, లాంగ్ జంప్‌లో ద్వితీయ, ప్రథమ స్థానం సాధించారు. కాగా 600, 400, 200, 100 మీటర్ల పరుగు పందెంలో, ఖోఖో, కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, ప్రబంధ కార్యదర్శి కె. మురళి కృష్ణ తదితరులు గురువారం పాఠశాలలో అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సేవాభావంతో పనిచేయాలి

జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు

ప్రజాశక్తి- డెంకాడ (భోగాపురం)

రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా వ్యవహరించి సేవా భావంతో వారి పనిచేయాలని జిల్లా రిజిస్ట్రారు టి. ఉపేంద్రరావు సిబ్బందికి సూచించారు. గురువారం భోగాపురం సబ్ రిజిస్ట్రారు కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారితో ముఖాముఖి మాట్లాడారు. రిజిస్ట్రేషన్ విధానంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం ద్వారా అవసరమైన సేవలను పూర్తిస్థాయిలో అందజేయాలన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన పలువురు రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి కొన్ని సూచనలు ఇస్తూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరితో సిబ్బంది స్నేహ భావంతో మెలగాలని, వారి పనిని నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కట్టుబడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భోగాపురం సబ్ రిజిస్ట్రారు పి. రామకృష్ణ పాల్గొన్నారు.

మిగులు సీట్లకు అడ్మిషన్లు

వేపాడ: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో మిగులు సీట్లకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ఉమ్మడి జిల్లాల సమన్వయ కర్త ఎస్. రూపవతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ఆధార్ కార్డుతో పాటు విద్యార్హత సర్టిఫికేట్‌తో అడ్మిషన్ కావాల్సిన పాఠశాల, కళాశాలకు నేరుగా వెళ్లి అడ్మిషన్ తీసుకోవచ్చునన్నారు. బాలురుకు కొప్పెర్ల, బాడంగి, పాలకొండ, సాలూరు, సీతానగరం మండలంలోని జోగింపేట, బాలికలు చీపురుపల్లి, నెల్లిమర్ల, వేపాడ, వియ్యంపేట, వంగర, గరుగుబిల్లి, కొమరాడ, భామిని పాఠశాలలు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలు కోసం సంబంధిత ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని కోరారు.